# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వేసవి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తెలంగాణలోని విద్యుత్ ఉప కేంద్రాల వద్ద సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

3. **స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

4. **రాబోయే 2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.**

==========================

వేసవి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ లో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నీటి సరఫరా కోసం ప్రతి జిల్లాకు కోటి రూపాయల చొప్పున నిధులు విడుదల చేయాలని సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంతో పాటు బోర్లు మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నివారణకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలోని విద్యుత్ ఉప కేంద్రాల వద్ద సౌరశక్తి ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రి వర్గ సమావేశ వివరాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరితో కలిసి నిన్న పాత్రికేయులకు వివరించారు. ఉమ్మడి జిల్లాల్లో 19 ప్రాంతాల్లో 20 మెగావాట్ల సామర్థ్యమున్న సౌరశక్తి ప్లాంట్లను అరవై ఆరు కోట్ల యాభై లక్షలు రూపాయలతో ప్రయోగాత్మక విధానంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణలో భూముల ధరలను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను సవరించాలని, వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న చోట క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు.

---------------------------

మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లులో జరిగిన కార్యక్రమంలో గ్రామ సంఘ సహాయకులు –వీఓఏలకు స్మార్ట్ ఫోన్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ పేదరిక నిర్మూలనలో వీఓఏల పాత్ర కీలకమని తెలిపారు. వారికోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 28 వేల 500 స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం కింద రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. నంద్యాల జిల్లా, అవుకు మండలం మెట్టుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నిన్న రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల భూమి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం నెలివాడ గ్రామంలో 66 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ఆయన ప్రారంభించారు. అనంతరం కెరటం గ్రామంలో 96 లక్షల రూపాయలతో నిర్మించిన సాగునీటి కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సంక్షేమ కార్యక్రమాలతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్లు నిర్మించడంతో పాటు, జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, పుష్కరాలకు దాదాపు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, వారి సౌకర్యార్థం టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పుష్కర నిధులతో శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని, రోడ్లు, డ్రైనేజీలు, ఘాట్లు, తాగునీటి సదుపాయాలు మెరుగుపరుస్తామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్..27.. సెకన్లు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు యోగా కార్యక్రమాల నిర్వహణపై ఆయుష్ అధికారులతో విజయవాడలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, యోగాసనాల ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, యోగా సంస్థలు, సేవా సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యోగా ట్రైనర్లతో సమావేశం నిర్వహించి కార్యక్రమాలపై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో మండల స్థాయి వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

---------------------------

మార్క్సిజం సిద్ధాంత సృష్టికర్త, తత్వవేత్త, ఆర్థిక శాస్త్రవేత్త కార్ల్ మార్క్స్ జయంతిని ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1818 మే 5వ తేదీన జర్మనీలో జన్మించిన కార్ల్ మార్క్ సామాజిక శాస్త్రాలను సరళమైన భాషలో రాసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. “దస్ క్యాపిటల్”, “ద కమ్యూనిస్ట్ మేనిఫెస్టో” గ్రంథాలను రాశారు. పెట్టుబడిదారీ విధానానికి భిన్నంగా, సోషలిస్టు సిద్ధాంతాన్ని తీసుకువచ్చిన కార్ల్ మార్క్స్ 1883 మార్చి 14న కన్నుమూశారు. సమానత్వ సమాజ స్థాపన కోసం ఆయన చేసిన సేవలను ప్రపంచ వ్యాప్తంగా స్మరించుకుంటూ ఈ రోజు నివాళు లర్పిస్తున్నారు.

---------------------------

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమం విధానంలో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 1 లక్షా 84 వేల మంది రైతుల నుంచి 14 లక్షల 40 వేల టన్నులకుపైగా ధాన్యం కొనుగోలుచేసినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా కొనుగోళ్లకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచి, తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మరో మూడు రోజులు విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 185 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు నిన్న బయలుదేరారు. విడిది కేంద్రం నుంచి విమానాశ్రయానికి వెళ్లే వాహనాలను మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ జెండా ఊపి ప్రారంభించారు. తెల్లవారుజామున 5 గంటలకు మొదటి విమానం, అనంతరం మరో రెండు విమానాల్లో మొత్తం 185 మంది యాత్రికులు బయలుదేరినట్లు చెప్పారు.

======================